


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక


PRGI Reg.No: APTEL/26/A0309

KADAPA MANASSAKSHI - Telugu Daily

వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 223 | ఆదివారం, 15 ఆగష్టు 2026 | పేజీలు : 4 వెల.రూ.2/-




## విజయవాడ రాజ్‌భవన్‌లో ఘనంగా 'ఎట్ హోమ్' కార్యక్రమం



విజయవాడ, ఆగస్టు 15: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ప్రథమ మహిళ సమీరా నజీర్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి లిసా గిల్ దంపతులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు, అఖిల భారత సేవల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, సైనిక అధికారులు, క్రీడాకారులు, ప్రతిభావంతులైన విద్యార్థులు, పద్మ పురస్కార గ్రహీతలు, పాత్రికేయులు, స్వాతంత్ర్య సమరయోధులు, వైద్య, సేవా రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ అతిథులను సాదరంగా ఆహ్వానించి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.




అమరావతి: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర 2047' ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయాభివృద్ధి, ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు అండ, మహిళల సాధికారత, సంక్షేమం--అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## కాకినాడలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






కాకినాడ: కాకినాడ పోలీసు కవాతు మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన అనంతరం పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన సతీమణి అన్నా కొణిదెల కూడా వేడుకల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న పవన్ కళ్యాణ్, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అటవీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, దేవాదాయ, నీటిపారుదల, విద్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల శాస్త్ర, సాంకేతిక ప్రదర్శనలు, పోలీసు జాగిలాల విన్యాసాలు, దేశభక్తి సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ హారేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా హస్తకళల కోసం క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు



రాజమహేంద్రవరం: హస్తకళల పరిరక్షణ, కళాకారులకు ముడి కలప కొరతను తీర్చే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ధవళేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర వుడ్ బ్యాంకును ప్రారంభించడంతో పాటు ఆరు ప్రధాన హస్తకళల సమూహాల పరిధిలోని వుడ్ బ్యాంకులను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు అవసరమైన కలపను అందుబాటులో ఉంచనున్నారు. రాజమహేంద్రవరం కేంద్రంలో ప్రస్తుతం 30 ఘనపు మీటర్ల కలప నిల్వ చేశారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, మాధవమాల, శెట్టిగుంట కళాకృతులు, బొబ్బిలి వీణల కళాకారుల కోసం ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారు. సతీమణి అన్నా కొణిదెలతో కలిసి కళాకృతులను పరిశీలించిన పవన్ కళ్యాణ్, కళాకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పలు కళాకృతులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అటవీశాఖ ఉన్నతాధికారులు, హస్తకళల రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి



అమరావతి, ఆగస్టు 15: పరేడ్ మైదానం నుంచి మహిళలతో కలిసి బస్సులో సీఎం శిబిర కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన స్త్రీ శక్తి లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. మహిళలకు తేనేటీ విందు ఇచ్చి వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పదేళ్లలో సాధించాలనుకుంటున్న లక్ష్యాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. కడప జిల్లాకు చెందిన ముస్లిం మహిళ కోటి రూపాయల పెట్టుబడితో వ్యాపారం చేయాలనే లక్ష్యాన్ని వివరించగా, విశాఖకు చెందిన ఉద్యోగిని కృత్రిమ మేధలో నైపుణ్యం సాధించి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిందని, ఇప్పటివరకు 87 కోట్ల ప్రయాణాలు జరిగాయని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో డబ్బు ఆదా అవుతోందన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు రూ.25 వేల కోట్ల పొదుపు సాధించారని, తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని ప్రశంసించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచుల నిర్మూలనకు మహిళలు చొరవ తీసుకోవాలని, రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అమరావతి నిర్మాణాలను చూడాలని మహిళలు కోరడంతో వారి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## చట్టబద్ధమైన పాలన, పారదర్శక న్యాయమే లక్ష్యం



అమరావతి, ఆగస్టు 15: ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవించడంతో పాటు పౌరులుగా విధులను బాధ్యతగా నిర్వర్తించడమే అమరవీరులకు నిజమైన నివాళి అన్నారు. సామాన్యులకు తక్కువ ఖర్చుతో పారదర్శకంగా, వేగవంతమైన న్యాయం అందించడమే న్యాయవ్యవస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు. ఈ ఏడాది నిర్వహించిన నాలుగు లోక్ అదాలత్‌లలో 13,95,017 కేసులను సామరస్యంగా పరిష్కరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు, హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



కమలాపురం, ఆగష్టు 15 (మనస్సాక్షి) కమలాపురం పట్టణం ఎంపిడిఓ కార్యాలం వద్దగల ప్రభుత్వ పాఠశాలలో నందు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను జాతీయ జెండాలతో అలంకరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు, స్వాతంత్ర్య పోరాట యోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, లాలా లజపతిరాయ్,బాలగంగాధర్ తిలక్,బిపిన్ చంద్రపాల్,మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్,నేతాజీ సుభాష్ చంద్రబోస్, నీలం సంజీవరెడ్డి,భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర ఎంతోమంది యువకుల, దేశభక్తుల,వీరమాతల, స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితంగా 80 సంవత్సరాల కిందట 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి భారతీయులకు స్వాతంత్రం లభించిందని, అప్పటినుండి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని వివరించారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని, భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా పాఠశాల స్థాయి నుంచే మంచి విలువలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండేందుకు ఎగ్జిబిషన్



వేంపల్లె, ఆగష్టు :15 (మనస్సాక్షి) వేంపల్లె ప్రజానీకం ఉల్లాసంగా ఉండేందుకు ఎగ్జిబిషన్ ఎంతో బాగుంటుందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక శ్లోక పాఠశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి గణేష్ మీనీ ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్ ను టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు కొద్దిగా ఉల్లాసంగా ఉండేందుకు ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎగ్జిబిషన్ లో పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులతో పాటు ఊయ్యాలు ఉన్నాయాని తెలిపారు. ఎగ్జిబిషన్ యాజమాన్యం కూడ ఎలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలలో వినోదం కలిగించేందుకు ఎగ్జిబిషన్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్దలు, పిల్లలు కూడ ఉల్లాసంగా ఉండేందుకు ఎగ్జిబిషన్ దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మహమ్మద్, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, జబిబుల్లా, ఇస్మాయిల్, దక్కా రమేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోగుల మల్లికార్జున, డాక్టర్ కరీముల్లా, శివ, యాసిన్, రాహుల్, ఎగ్జిబిషన్ మేనేజర్ యాసిన్, నిర్వాహకుడు సన్ ముఖ్, తక్కెల షరీఫ్ లు పాల్గొన్నారు.

# జూదమాడుతున్న వ్యక్తులు అరెస్టు..

కమలాపురం, ఆగష్టు :15 (మనస్సాక్షి) కడపజిల్లా,కమలాపురంలో, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో జూదమాడుతున్నారన్న పక్కా సమాచారం రావటముతో పోలీసులు చాకచక్యంగా జూదమాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 15వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని జూదమాడుతున్న వ్యక్తుల పై కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీనివాసులు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



ఎర్రగుంట్ల, ఆగష్టు :15 (మనస్సాక్షి) ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్సై నాగ మురళి జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తారని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కడప ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు









కడప ఆగష్టు 15 (మనస్సాక్షి) జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం గావించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక విభాగం డీఎస్పీ ఎన్. సుధాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు టి. రెడ్డెప్ప, దారెడ్డి భాస్కర్ రెడ్డి, డీసీఆర్బీ సీఐ ఈశ్వర్ రెడ్డి, ఆర్ఐ సోమశేఖర్ నాయక్‌తో పాటు పోలీసు, క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ బంగ్లాలో ఘనంగా 'అట్ హోమ్' కార్యక్రమం













కడప ఆగష్టు :15 (మనస్సాక్షి) 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో శనివారం సాయంత్రం 'అట్ హోమ్' కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినీ, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రతతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. విధులు, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి వైఎస్సార్ జిల్లాకు రాష్ట్ర అభివృద్ధిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కోరారు. జిల్లా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కడప ముద్ర అకాడమీ, ప్రొద్దుటూరు నృత్య తరంగిణి కళాబృందం ప్రదర్శనలు అలరించాయి. వివిధ శాఖల అధికారులు, వారి కుటుంబ సభ్యులు నృత్య, గాన కార్యక్రమాల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. కళాకారులను కలెక్టర్ జ్ఞాపికలతో సత్కరించారు.

కడప మనస్సాక్షి
PRGI Reg.No: APTEL/25/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily
ఆదివారం, 16 ఆగష్టు 2026

# ఎంపిడిఓ కార్యాలయం వద్ద జెండా ఎగరవేసిన జడ్పీటీసీ,ఎంపీపీ




వేముల, (మనస్సాక్షి): వేముల మండలం లోని స్థానిక వేముల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శనివారం ఉదయం 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి,ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ ఆద్వర్యం లో ఘనంగా నిర్వహించారు.వేముల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ శారదమ్మ మరియు అధికారులు ఏర్పాటు చేసినటువంటి జెండాను వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి,వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ ప్రజా ప్రతినిధులు,అధికారులతో కలిసి జెండా ఎగురవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన స్వాతంత్ర్యం కోసం పోరాడిన అసువులు బాసిన వీరులు గుర్తు చేసుకుంటూ, ఈ రోజు మనం స్వేచ్ఛగా ఉన్నాము అంటే అధి ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే అన్నారు.మన దేశ స్వాతంత్ర్యం కోసం అనేకమంది తమ జీవితాలను అంకితం చేశారు అని వారి ఆశయాలు అనుగుణంగా ప్రతి ఒక్కరు కూడా మన స్ఫూర్తితో ముందుకు నడవాలని వారు తెలియజేశారు,అలాగే అన్ని ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాల్లో జెండా ను ఆయా అధికారులు ఎగురవేశారు.అన్ని సచివాలయుల్లో,ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండా ఎగురవేశారు,అలాగే వేముల మండలం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయలవద్ద ఆయా అధికారులు జెండాను ఎగురవేశారు,వేముల ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ అధికారులకు ప్రజా ప్రతినిధులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ నరసింహ రెడ్డి నాగ మల్లారెడ్డి, ఎంపీటీసీ లు మరక మల్ రెడ్డి రామచంద్ర రెడ్డి, బాబ్జాన్,కో ఆప్షన్ మండి మా పీ రా,భాస్కర్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్,సర్పంచ్ నగప్పు, రమణ ల, డిప్యూటీ ఎంపీడీవో రంగయ్య, ఉపాధి సిబ్బంది అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# కమలాపురం టీడీపీ కార్యాలయంలో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ



కమలాపురం, ఆగష్టు :15 (మనస్సాక్షి): కమలాపురం నగర పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను కమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అప్పటి ప్రజలకు దేశంపట్ల ఎంతటి నిబద్ధత,గౌరవము,కలిగి ఉండేవారో తెలియజేసారు. అదే విధంగా ఇప్పటి దేశ యువత,ప్రజలు దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# మదరసాలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు - జెండావిష్కరణ




చెన్నూరు, ఆగష్టు :15 (మనస్సాక్షి): భారతదేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్టు 15 శనివారం నాడు చెన్నూరులోని ముస్లిం మైనారిటీ కాలనీ మంబా- ఉల్- ఉలూమ్ మదరసాలో పోలీసు సిఐ చాన్బాషా ముఖ్యఅతిథిగా హాజరుకాగా మద్రసా పెద్దలు షబ్బీర్ హుస్సేన్ గారు, యూసుఫ్ గారు, రఫీక్ హజరత్ ముప్పన్నెల జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దేశభక్తిని చాటుకుంటూ జాతీయగీతం ఆలపించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. వేడుకల విశేషాలు మదరసా ప్రాంగణాల్లో ఘనంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మస్జిదు, ఉలేమాలు, ముస్లిం యోధులు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులకు దేశంపట్ల ఉండాల్సిన బాధ్యతలపై ఉపాధ్యాయులు ప్రసంగించారు. దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

# నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**-చైర్మన్ కొట్టె నారాయణరెడ్డి.**






వేంపల్లె, (మనస్సాక్షి) వేంపల్లి పట్టణంలోని పాత గండి రోడ్డు నందు గల నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసి రెడ్డి హాజరయ్యారు. పాఠశాల ఆవరణను జాతీయ జెండాలతో అలంకరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, లాలా లజపతిరాయ్,బాలగంగాధర్ తిలక్,బిపిన్ చంద్రపాల్,మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్,నేతాజీ సుభాష్ చంద్రబోస్, నీలం సంజీవరెడ్డి,భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర ఎంతోమంది యువకుల, దేశభక్తుల,వీరమాతల, స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితంగా 80 సంవత్సరాల కిందట 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి భారతీయులకు స్వాతంత్రం లభించిందని,అప్పటినుండి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నా మని తులసి రెడ్డి అన్నారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టే నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి తరం విద్యార్థులు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని, భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా పాఠశాల స్థాయి నుంచే మంచి విలువలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోట్లదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు...

**-విద్యార్థుల సర్వతో ముఖా భివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం. మాజీ సర్పంచ్ రామునాయుడు..**



యర్రగుంట్ల, ఆగష్టు :15 (మనస్సాక్షి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోట్లదుర్తి నందు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగినవి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ రామునాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు పారితోషికాలు ఎంతో అవసరమని వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తాయి అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాం మాట్లాడుతూ 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు విద్యార్థులలో మనోభావాలను పెంచుతున్నాయి అన్నారు. చరిత్ర తెలుసుకోవడంలో విద్యార్థులు మౌలిక విలువలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామ పెద్దలు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంలో జిల్లా తెలుగుదేశం నాయకుడు మరియు పోట్లదుర్తి మాజీ గ్రామ సర్పంచి అయిన సీఎం సురేష్ నాయుడు పదవ తరగతిలో మొదటి రెండు మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా 25వేల రూపాయలను అందించారు. తదనంతరం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్ రెడ్డి మరియు లక్ష్మీలు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచులు ,ఎంపీటీసీలు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనారు.




# ఆర్కే వ్యాలీ క్యాంపస్ లో అంగరంగ వైభవంగా జరిగిన 80వ స్వాతంత్రం దినోత్సవం వేడుకలు






ట్రిపుల్ ఐటి, ఆగష్టు :15 (మనస్సాక్షి) కార్యక్రమంలో మొదటగా డైరెక్టర్ జి విజయ ప్రకాష్ జెండా ఎగురవేసి వందనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విచ్చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన విద్యాభ్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు కోర్సు పూర్తయ్యలోపు ఉన్నత ఉద్యోగాలని సంపాదించుకొని వెళ్లాలని తెలిపారు. అంతే కాకుండా నేటి బాలలే రేపటి పౌరులు కావున ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యతగా దేశ సేవ చేయాలని హితవు పలికారు. కళాశాలలో ఏర్పాటుచేసిన వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా దేశభక్తి గీతాలు, దేశభక్తిని చాటే సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు మరియు యోగా ప్రదర్శనలతో ప్రాంగణం మొత్తం ఆకర్షణీయంగా మారింది. ఈ కార్యక్రమంలోడైరెక్టర్ ప్రొఫెసర్ జి విజయ ప్రకాష్ , ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ,పాలన అధికారి డాక్టర్ పి రవికుమార్ , డీన్ అకాడమిక్స్ మరియు స్టూడెంట్ వెల్ఫేర్ రమేష్ కైలాస్, డాక్టర్ జి వెంకటేష్ గారు, ఆర్థిక అధికారి డాక్టర్ జి రమేష్ , స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు, అధ్యాపక అధ్యాపకత్ర బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు బాల యల్లారెడ్డికి రెడ్యం నివాళి

చెన్నూరు ఆగష్టు :15 (మనస్సాక్షి) బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిస్వార్థంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాల యల్లారెడ్డి స్ఫూర్తిదాయకుడని వైఎస్సార్ సీపీ కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం బాల యల్లారెడ్డి స్వగృహంలో ఆయనను సన్మానించి, పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా దేశానికి స్వాతంత్ర్యం రావాలనే లక్ష్యంతో బాల యల్లారెడ్డి బ్రిటిష్ వారితో పోరాడారని కొనియాడారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో అవినీతి, అక్రమాలపై పోరాడాలని, నీతి, నిజాయితీకి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా పేదరికం, అవినీతి, అక్రమాలు కొనసాగుతున్నాయని, వాటి నిర్మూలనకు సమష్టిగా మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టిపల్లె సిద్ధారెడ్డి, మిట్టా మాధవరెడ్డి, ముత్తూరు వెంకట సుబ్బయ్య, బత్తల సుబ్బరాయుడు యాదవ్, మద్దిక నాగేశ్వరరెడ్డి, తవ్వా వెంకట సుబ్బారెడ్డి, పెడబల్లె విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**-టిడిపి కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ**



వేంపల్లె, ఆగష్టు :15 (మనస్సాక్షి): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శనివారం టిడిపి కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవవందనం సమర్పించారు. అనంతరం స్వాతంత్ర్య ఉద్యమంలో మహానీయుల సేవలు, ప్రాణ త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకుని దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ వేడుకల్లో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరబధ్ర, మైనార్టీ ఫైనాన్స్ సంస్థ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేమకుమార్, క్లస్టర్ ఇంచార్జీ మహమ్మద్, నాయకులు బుజ్జి, మోహన్ రెడ్డి, తిప్పారెడ్డి, శివకృష్ణారెడ్డి, మడకశ్రీను, పీరా, షరీఫ్, వేమనారాయణ, ఇలియాస్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వీకులు ఇచ్చిన స్వాతంత్రాన్ని నిలబెట్టుకోవడం నేటి మన కర్తవ్యం

**-డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**



వేంపల్లి, ఆగష్టు :15 (మనస్సాక్షి): మన పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేసి సంపాదించి మనకు ఇచ్చిన స్వాతంత్రాన్ని పరిరక్షించి, మరిన్ని మెరుగులు దిద్ది భావి తరాల వారికి అందించాల్సిన పవిత్రమైన బాధ్యత నేటి తరానికి చెందిన మన మీద ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు 80వ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి భారతమాత ముద్దుబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కొందరు దేశద్రోహుల కారణంగా దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు భారతీయులు బానిసత్వాన్ని అనుభవించారని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, లాలా లజపతిరాయ్,బాలగంగాధర్ తిలక్,బిపిన్ చంద్రపాల్,మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్,నేతాజీ సుభాష్ చంద్రబోస్, నీలం సంజీవరెడ్డి,భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు తదితర ఎంతోమంది యువకుల, దేశభక్తుల,వీరమాతల, స్వాతంత్ర సమరయోధుల త్యాగాల ఫలితంగా 80 సంవత్సరాల కిందట 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి బానిసత్వం నుంచి భారతీయులకు స్వాతంత్రం లభించిందని,అప్పటినుండి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశు,చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య,బద్రీనాథ్ రాఘవయ్య, రవి, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు. వేంపల్లి లోని శ్లోకా పాఠశాలలో, నారాయణ విద్యాసంస్థలో తులసి రెడ్డి స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాలలసిబ్బందికి,విద్యార్థినీ విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు చెప్పారు. పాఠశాలల కరెస్పాండెంట్లు నారాయణరెడ్డి, నవనీశ్వర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**-ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఉషశ్రీ.**

వేంపల్లె, ఆగష్టు :15 (మనస్సాక్షి): వేంపల్లె వై.ఎస్.ఆర్. వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, విద్యార్థులు దేశభక్తితో, క్రమశిక్షణతో చదువుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో దేశభక్తి గీతాలు, ప్రసంగ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి.



విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సజీయబేగం, అధ్యాపకులు నాగేంద్ర,హరిత,రాజా రెడ్డి,కుమార్ రాజా,మసూద్ ,పీడీ తేజేంద్ర, వినోద్, శ్రీను,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఆవరణ, కలెక్టర్ బంగ్లాలో ఘనంగా జెండా వందన కార్యక్రమం




కడప, ఆగష్టు :15 (మనస్సాక్షి) స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వందేమాతరం గీతాలావన జాతీయ పతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. అనంతరం జాతీయగీతం ఆలపించిన అనంతరం అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపి సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు.. డిఆర్వో మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏవో నాగేశ్వరరావు, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పాతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు.

## గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు




గండి, (మనస్సాక్షి) శ్రావణ మాస మహోత్సవాలను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ యూనిట్--3౬ 4 వాలంటీర్లు గండి ఆలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాలంటీర్లు ఆలయ ప్రాంగణంలో వివిధ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని, భక్తులకు మరియు ఆలయ సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలను అందించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు అనిత ౬ కోటేశ్వరి మార్గదర్శకత్వంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ మరియు సమాజం పట్ల బాధ్యత పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఎన్ఎస్ఎస్ యూనిట్--3౬4 వాలంటీర్లు అందించిన సేవలను ఆలయ అధికారులు మరియు భక్తులు అభినందించారు. సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం ద్వారా విద్యార్థులు సమాజానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించారని ఆమె పేర్కొన్నారు.

## శ్రీ చైతన్య హై స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




వేంపల్లి, ఆగష్టు :15 (మనస్సాక్షి): వేంపల్లిలోని శ్రీ చైతన్య హై స్కూల్ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేంపల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీ వెంకట రామిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. విద్యతో పాటు దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి గారు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశం పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత, పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల చైర్మన్ శ్రీ బి. చక్రపాణి రెడ్డి , డైరెక్టర్లు శ్రీ చేతన్ రెడ్డి , శ్రీ చైతన్య రెడ్డి కలిసి ముఖ్య అతిథి ఎం. ఈ.ఓ.వెంకట రామిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ప్రత్యేక అతిథులుగా ఓం శాంతికి చెందిన త్రివేణి సిస్టర్, సౌమ్య సిస్టర్ పాల్గొని విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవ యొక్క ప్రాముఖ్యతపై సందేశాలు అందించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, నాటికలు, ప్రసంగాలు, ఫ్యాన్సీ డ్రెస్ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భగత్‌సింగ్, మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు తదితర స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంపొందించాయి.

## శ్లోకా పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర సంబరాలు.



వేంపల్లి, ఆగష్టు :15 (మనస్సాక్షి) కడప జిల్లా వేంపల్లి లో శ్లోక పాఠశాలలో 80వ భారత స్వాతంత్ర దినోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి.రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ సింగారెడ్డి మునిరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ,అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,వెంకటేశు,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య,పాఠశాల కరెస్పాండెంట్ నవనీశ్వర్ రెడ్డి,శ్రీదేవి, చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది,భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈనాటి విద్యార్థులే రేపటి పౌరులు.అందుకోసం విద్యార్థి దశ నుంచే బాలబాలికల్లో జాతీయతా భావాన్ని, దేశభక్తిని కలిగించాలని తులసి రెడ్డి అన్నారు.

## చెన్నూరు వాసికి ఉత్తమ ప్రశంసాపత్రం.



చెన్నూరు, ఆగష్టు :15 (మనస్సాక్షి): భారతదేశ 80వ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 శనివారం నాడు కర్నూలు జిల్లా వైద్యారోగ్యశాఖలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరుగా విధులు నిర్వహిస్తున్న లతిఫ్ సాబుగారి అలీహైదర్ ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రంను రాష్ట్రా పరిశ్రమల ౬ వాణిజ్య శాఖ మంత్రి శ్రీ. టి.జి.భరత్ గుప్తా, కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్. అట్టాడ సిరి, కర్నూలు జిల్లా యస్ పి. శ్రీ విక్రాంత్ పాటిల్, చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా అలీహైదర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్ గారికి మరియు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ ౬ టిబి అధికారి డాక్టర్ యల్. భాస్కర్ గారికి కృతజ్ఞతలు తెలిపినారు.

## ఎద్దుల కొండా దేవస్థానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం

**-.కార్యనిర్వాహణాధికారి కడప. సుభాష్.**

వేంపల్లి, (మనస్సాక్షి) : వేంపల్లి పట్టణము పాపాగ్ని నదీతీరమున ఎద్దుల కొండపై వెలసియున్న శ్రీ వృషభాషలేశ్వర స్వామి వారిని, శ్రావణమాసం మొదటి శనివారం సందర్భముగా శ్రీ స్వామివారిని దేవస్థానం ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ ప్రత్యేక పూల అలంకరణ చేయడం జరిగినది. దేవస్థానం నకు స్వామివారి దర్శనార్థము కడప జిల్లా నుండి ఏ కాక పొరుగు జిల్లాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తాదులు స్వామివారిని దర్శించుకొనుటకు అధిక సంఖ్యలో ఇచ్చేయడం జరిగినది. దేవస్థానము నందు ఈరోజు అనగా 15.08.2026 వ తేదీ శనివారం రోజున దేవస్థానమునకు శ్రీ స్వామివారి ని దర్శించుకొనుటకు విచ్చేయు భక్తాదుల కొరకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమమును వేంపల్లి పట్టణమునకు చెందిన, సదరు దేవస్థానమునకు పాలకమండలి సభ్యులుగా ఉన్న శ్రీ నాగిశెట్టి సునీల్ కుమార్ వారి ధర్మపత్ని శ్రీమతి సుహాసిని భక్తాదులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగినది. ఆలయ సాంప్రదాయం ప్రకారం వారిని సత్కరించడం జరిగినది.దేవస్థానం నందు ప్రతి శనివారం దాతలచే అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడుచున్నది. ఆసక్తి గల దాతలు దేవస్థానం నందు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయుటకు వారి యొక్క వివరములను దేవస్థానము కార్యాలయం నందు సంప్రదించవలసినదిగా కోరుచున్నాము. శ్రీ స్వామివారి సన్నిధి యందు అన్న ప్రసాద వితరణ చేసిన దాతలకు వారి గోత్రం గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పూజలు చేయించి, ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించబడును..



Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284